
సాక్షి రాజన్న సిరిసిల్ల

సోమవారం । 10 । ఏప్రిల్ । 2023



గోశాలకు రాజన్న కోడెలు

వేములవాడఅర్బన్: రాజన్నకు చెందిన 20 కోడెలను జనగామ జిల్లా దేవరుప్పాల మండలం ధర్మపురం గ్రామానికి చెందిన భద్రకాళీ గోశాలకు ఆదివారం అందజేశారు.



భక్తుల పుణ్య స్నానాలు

ధర్మపురి: ధర్మపురి పుణ్యక్షేత్రంలోని పవిత్ర గోదావరిలో ఆదివారం భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. గంగమ్మ గౌరమ్మకు మొక్కులు చెల్లించారు.

గరిష్ఠం/కనిష్ఠం

37.0/24.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతమవుతుంది. వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

పొరుగువాడు ఆకలితో బాధపడుతుంటే తాను కడుపునిండా భుజించే వ్యక్తి విశ్వాసి కాజాలడు.

- మహ్మద్ ప్రవక్త

ఇఫ్తార్	సహర్
సోమ 6.34	మంగళ 4.37

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

జ్యోతిరావు పూలే జయంతి ఉత్సవాల కన్వీనర్‌గా శంకర్



పాకాల శంకర్‌గౌడ్

సిరిసిల్లఎడ్యుకేషన్: ప్రభుత్వం అధికారికంగా ఈనెల 11న నిర్వహించే మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలకు నిర్వహణ కమిటీ కన్వీనర్‌గా జిల్లాకేంద్రంలోని శివనగర్ పాఠశాల ఉపాధ్యాయుడు పాకాల శంకర్‌కు అవకాశం దక్కింది. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న వేడుకలకు మంత్రి గంగుల కమలాకర్ చైర్మన్‌గా ఉత్సవ కమిటీని ప్రభుత్వం నియమించిందన్నారు. ఈ కమిటీలో తనకు అవకాశం రావడం ఆనందంగా ఉందన్నారు. అవకాశం కల్పించిన సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, గంగుల కమలాకర్, బీసీ కమిషన్ సభ్యులు కిశోర్‌గౌడ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధికి పెద్దపీట

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఆగయ్య

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): పల్లెల ముఖచిత్రాలు మార్చేందుకు మంత్రి కేటీఆర్ సహకారంతో ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తుందని, ఈ ప్రాంతంలో పదేళ్లలో ఊహించని అభివృద్ధి జరిగిందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట మండలంలో సోమవారం మంత్రి కేటీఆర్ ప్రారంభించనున్న జీపీ భవనాలు, వంతెనల వద్ద ఏర్పాట్లను ఆదివారం ఆగయ్య పరిశీలించారు. దుమాలలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ, గౌడ, మహిళా సంఘాల భవనాలు, చిట్టివాగుపై నిర్మించిన వంతెనలు, బుగ్గరాజేశ్వరతండాలో పంచాయతీ భవనం, ఎస్టీ కమ్యూనిటీ భవనం ప్రారంభోత్సవాలు, రాచర్లగుండారంలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. గత ప్రభుత్వాలు ఈ ప్రాంతంలో ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, సర్పంచ్ అజ్మీరా రజిత తదితరులు ఉన్నారు.

12న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

సిరిసిల్లఅర్బన్: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 12న జిల్లా స్థాయి తెలంగాణ స్టేట్ ఫెడరేషన్ కప్–20 జూనియర్ అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు చిక్కాల రామారావు, ప్రధాన కార్యదర్శి బొజ్జ చంద్రశేఖర్ ఆదివారం తెలిపారు. 16 నుంచి 20 ఏళ్లలోపు వారు అర్హులన్నారు. లాంగ్‌జంప్, షార్ట్‌పుట్ త్రో, డిస్కస్‌త్రో, పరుగుపందెంలలో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గెలుపొందిన క్రీడాకారులను ఈనెల 15, 16 తేదీలలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయిలో గెలుపొందిన వారిని జాతీయస్థాయికి ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. 79014 64456లో సంప్రదించాలని కోరారు.

'కార్మికుల హక్కులు కాలరాశారు'



మాట్లాడుతున్న రూప్‌సింగ్

సిరిసిల్లటౌన్: కేంద్రం ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తుందని, కార్మిక, కర్షకుల హక్కులను కాలరాస్తుందని బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి ఎల్.రూప్‌సింగ్ పేర్కొన్నారు. మే డే సన్నాహక సమావేశం ఆదివారం సిరిసిల్లలోని ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులో నిర్వహించారు. రూప్‌సింగ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. లాభాల్లో నడుస్తున్న ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరిస్తూ కార్పొరేట్ శక్తులకు మోదీ సర్కారు కొమ్ముకాస్తుందని విమర్శించారు. తెలంగాణ ఆవిర్భావం నుంచి సీఎం కేసీఆర్ సంక్షేమ పాలన అందిస్తున్నారన్నారు. టీఎస్‌పీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, బీఆర్‌ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెంగళ శ్రీనివాస్ పాల్గొన్నారు.

శరవే'గంగా' పాతాళానికి!

- అడుగంటిన భూగర్భ జలాలు
- ఎత్తిపోతున్న బోర్లు.. బావులు
- జిల్లాలో పడి'పోతున్న' నీటినిల్వలు
- వీర్నపల్లిలో 21.67మీటర్లకు నీటిమట్టం

సిరిసిల్ల: జిల్లాలో వర్షాకాలంలో సాధారణం కన్నా ఎక్కువగా వానలు కురిశాయి. చెరువులు, కుంటల్లో నీరుచేరింది. భూగర్భ జలాలు రికార్డుస్థాయిలో పెరిగాయి. నీరు పుష్కలంగా ఉందనే ధీమాతో రైతులు యాసంగి సీజన్‌లో ఎక్కువ విస్తీర్ణంలో వరి సాగు చేశారు. వ్యవసాయానికి విద్యుత్ సరఫరా బాగానే ఉండడంతో పంటలకు ఢోకా లేదనుకున్నారు. నీటి వినియోగం బాగా పెరగడంతో జిల్లాలో భూగర్భ జలాలు వేగంగా పడిపోయాయి.

గంభీరావుపేట, వేములవాడ రూరల్‌లో మెరుగు..

జిల్లాలోని అన్ని మండలాల్లోనూ భూగర్భ జలాలు గతేడాదితో పోల్చితే.. వేగంగా అడుగంటిపోగా.. గంభీరావుపేట, వేములవాడరూరల్ మండలాల్లో మాత్రం మెరుగ్గానే ఉన్నాయి. గంభీరావుపేటలో గతేడాది మార్చిలో 8.18 మీటర్లలో నీటి ఊటలు ఉండగా.. ఈ ఏడాది మార్చిలోనూ 8.49 మీటర్లలో నీరు ఉంది. అంటే కేవలం 0.31 మీటర్ల లోతుల్లోకి భూగర్భ జలాలు తగ్గాయి. అదే వేములవాడ రూరల్ మండలంలో గత ఏడాది మార్చిలో 4.43 మీటర్లలో నీటి ఊటలు ఉండగా.. ఈ ఏడాది మార్చిలోనూ 4.93 మీటర్లలోనే భూగర్భ జలాలు ఉన్నాయి. కేవలం 0.49 మీటర్ల లోతులోకి పడిపోయాయి. అదే వీర్నపల్లి మండలంలో గత ఏడాది 11.70 మీటర్ల లోతుల్లో భూగర్భ జలాలు ఉండగా.. ఈ ఏడాది మార్చిలో లెక్కిస్తే ఏకంగా 21.67 మీటర్లకు పడిపోయాయి. 9.97 మీటర్ల లోతుల్లోకి పాతాళ గంగ చేరింది. ఎల్లారెడ్డిపేట మండలంలోనూ ఇలాగే 5.94 మీటర్ల లోతుల్లోకి నీటి ఊటలు పడిపోయాయి.

పెరిగిన నీటి వినియోగం

జిల్లావ్యాప్తంగా గతేడాది సమృద్ధిగా వర్షాలు పడడంతో నీటి వనరులు పెరిగాయి. బోయినపల్లి మధ్యమానేరు జలాశయం పూర్తిస్థాయిలో నింపారు. అనంతగిరి ప్రాజెక్టు ద్వారా రంగనాయక సాగర్‌కు ఎత్తిపోశారు. ప్రస్తుతం మధ్యమానేరులో 20 టీఎంసీల నీరు ఉంది. ఎగువ మానేరు కూడవెల్లి వాగు ద్వారా నింపారు. నిమ్మపల్లి మూలవాగు జలాశయం తూము రిపేరుతో నిరంతరం నీరు కారుతోంది. జిల్లాలో వరి విస్తీర్ణం అధికమై.. బావులు, బోర్ల ద్వారా నీటి వినియోగం పెరిగింది. దీంతో వేగంగా భూగర్భ జలాలు పడిపోయాయి. ఎంతోకాలంగా సాగు నీరు అందించిన బోర్లు సైతం ఈసారి ఎండిపోయాయి. దేశంలోనే భూగర్భ జలాలు వేగంగా అభివృద్ధి చెందిన జిల్లాగా రాజన్న సిరిసిల్లకు ఈ ఏడాది ప్రత్యేక గుర్తింపు లభించింది. కానీ అదే స్థాయిలో భూగర్భ జలాలు అడుగంటిపోవడం కొసమెరుపు.



ఇది వీర్నపల్లిలోని ఓ వ్యవసాయ బోరు. మార్చి నెలాఖరు వరకు బాగానే నీరు వచ్చింది. ఏప్రిల్ మొదటి వారంలో ఒక్కసారిగా బోరులో నీరు తగ్గిపోయింది. వరి చివరి దశలో ఉంది. రెండు తడులు అయితే.. మరో పది రోజుల్లో కోతకు వస్తుంది. ఈ దశలో బోరు నీరు తగ్గడం రైతుల్లో ఆందోళన కలిగిస్తోంది. ఇలా జిల్లా వ్యాప్తంగా ఒక్కసారిగా భూగర్భ జలాలు పడిపోవడంతో బోర్లు ఎత్తిపోతున్నాయి. బావుల్లో నీటి ఊటలు అడుగంటిపోతున్నాయి.

జిల్లా వ్యవసాయ స్వరూపం

వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు	: 67,154
వరిసాగు	: 1,70,035 ఎకరాలు
జిల్లాలో బోర్లు	: 37,630 (చాలా బోర్లు ఎండిపోయాయి)
బావులు	: 28,124 (ఎక్కువ బావులు వట్టిపోయాయి)
జిల్లాలో రైతులు	: 84,109

జిల్లాలో భూగర్భ జలాల తీరు (మీటర్లు.. లోతులో)

మండలం	2022 మార్చి నాటికి	2023 మార్చి నాటికి
బోయినపల్లి	5.91	7.00
చందుర్తి	4.35	6.60
గంభీరావుపేట	8.18	8.49
ఇల్లంతకుంట	6.86	5.94
కోనరావుపేట	8.06	9.78
ముస్తాబాద్	12.19	11.83
రుద్రంగి	3.41	7.96
సిరిసిల్ల	10.05	11.10
తంగళ్లపల్లి	6.79	9.82
వీర్నపల్లి	11.70	21.67
వేములవాడ రూరల్	4.43	4.93
వేములవాడ అర్బన్	11.21	15.44
ఎల్లారెడ్డిపేట	6.21	12.15
జిల్లా సగటున	7.83	9.64

అవసరం మేరకు వాడుకోవాలి



నీటిని అందరూ అవసరం మేరకు పొదుపుగా వాడుకోవాలి. భూగర్భ జలాలు పరిమితంగా ఉంటాయి. వాటిని జాగ్రత్తగా సద్వినియోగం చేసుకోవాలి. వ్యవసాయానికి రైతులు నీటిని అవసరాలకు మించి వాడడం సరికాదు. జిల్లాలో నెల రోజుల వ్యవధిలో 1.81 మీటర్ల లోతుల్లోకి సగటున నీటి మట్టం పడిపోయింది. నీటి వినియోగం పెరిగి ఇలా ఒక్కసారిగా తగ్గిపోతుంది. – నర్సింహులు, జిల్లా భూగర్భ జలశాఖ అధికారి



క్యూలైన్‌లో వేచిచూస్తున్న భక్తులు





రాజన్న నమోస్తుతి

వేములవాడ: రాజన్నను ఆదివారం 30 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ధర్మగుండంలో స్నానాలు చేసిన భక్తులు తడి బట్టలతో కల్యాణకట్టలో తలనీలాలు, రాజన్నకు కోడెమొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం బద్దిపోచమ్మకు బోనం మొక్కులు చెల్లించుకున్నారు. ఏర్పాట్లను ఆలయ ఈవో కృష్ణప్రసాద్, ఏఈవోలు శ్రీనివాస్, ప్రతాప నవీన్ పరిశీలించారు. రాజన్నను భూపాలపల్లి ఎస్పీ సురేందర్‌రెడ్డి దంపతులు దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించారు. పర్యవేక్షకులు అల్లి శంకర్‌స్వామి వారి ప్రసాదాలు అందజేశారు.

నేడు జిల్లాలో మంత్రి కేటీఆర్ పర్యటన

- అంబేడ్కర్ విగ్రహాల ఆవిష్కరణ



మంత్రి కేటీఆర్

సిరిసిల్ల: రాజన్నసిరిసిల్ల జిల్లాలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్‌శాఖ మంత్రి కె.తారక రామారావు సోమవారం పర్యటిస్తున్నారు. తంగళ్లపల్లి మండలం చీర్లవంచలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ, చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ, రూ.1.25 కోట్లతో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభం, ఎస్సీ, ముదిరాజ్ కమ్యూనిటీ హాల్స్‌కు శంకుస్థాపన చేస్తారు. గోపాల్‌రావుపల్లెలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. పాపయ్యపల్లెలో రూ.21 లక్షలతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని మంత్రి ప్రారంభిస్తారు. గండిలచ్చపేటలో అంబేడ్కర్, జ్యోతిభా, సావిత్రిబాయిపూలే విగ్రహాల ఆవిష్కరణ, దళితబంధులో ఫౌల్ట్రీఫామ్ యూనిట్ ప్రారంభం, రూ.20 లక్షలతో నిర్మించిన కేసీఆర్ ప్రగతి ప్రాంగణం ప్రారంభోత్సవం, రూ.21 లక్షలతో నిర్మించే గ్రామపంచాయతీ భవనానికి శంకుస్థాపన చేస్తారు. మండెపల్లిలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. లక్ష్మీపూర్‌లో రూ.15 లక్షలతో నిర్మించిన హెల్త్ సబ్‌సెంటర్‌ను ప్రారంభిస్తారు. ఎల్లారెడ్డిపేట మండలం దుమాలలో అంబేద్కర్ విగ్రహం, రూ.10లక్షలతో నిర్మించిన గౌడ కమ్యూనిటీ భవనం, రూ.10లక్షలతో నిర్మించిన మహిళా సంఘం భవనాన్ని ప్రారంభిస్తారు. చిట్టివాగుపై నిర్మించిన వంతెనను ప్రారంభిస్తారు. రూ.20లక్షలతో నిర్మించే కేసీఆర్ ప్రగతి ప్రాంగణానికి మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేస్తారు. గుండారంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. బుగ్గరాజేశ్వరతండాలో రూ.21 లక్షలతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని, రూ.10 లక్షలతో నిర్మించిన ఎస్టీ కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తారు. గంభీరావుపేట మండలం గోరింట్యాలలో అంబేద్కర్ విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరిస్తారు. ఈమేరకు మంత్రి కేటీఆర్ సోమవారం పర్యటించే షెడ్యూల్‌ను అధికారులు ఆదివారం వెల్లడించారు.

రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి వస్తాం

- ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్‌కుమార్
- మే నెలలో సీఎం కేసీఆర్ రాక : ఎమ్మెల్యే రమేశ్‌బాబు



మాట్లాడుతున్న బోయినపల్లి వినోద్‌కుమార్

వేములవాడ: రానున్న ఎన్నికల్లో వంద సీట్లు గెలిచి.. మళ్లీ అధికారంలోకి వస్తామని ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు. వేములవాడలోని ఎమ్మెల్యే రమేశ్‌బాబు నివాసంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. అక్టోబర్‌లో ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందని, కేంద్రం మరో నెల రోజుల ముందుగానే ఎన్నికలు నిర్వహించాలని చూస్తోందన్నారు. ఎప్పుడు ఎన్నికలొచ్చినా తమ పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉన్నారన్నారు. తలసరి ఆదాయాన్ని రూ.3.17 లక్షలకు పెంచినట్లు కేంద్ర మంత్రి ఇటీవల పార్లమెంట్‌లో ప్రకటించారని గుర్తు చేశారు. దేశంలోనే తెలంగాణ అగ్రగామిగా ఉండడం బీజేపీ నాయకులకు మింగుడుపడటం లేదన్నారు. వేములవాడ నియోజకవర్గంలో ఇప్పటికే రెండుచోట్ల ఆత్మీయ సమ్మేళనాలు పూర్తి చేశామని, మిగతా మండలాల్లోనూ పూర్తి చేయబోతున్నట్లు తెలిపారు. వేములవాడ టికెట్ రమేశ్‌బాబుకే ఇస్తున్నట్లు సూత్రప్రాయంగా వినోద్‌కుమార్ వెల్లడించారు.

బండి సంజయ్ ఏం చేశారు?

కరీంనగర్ ఎంపీగా గెలిచిన బండి సంజయ్ ఈ ప్రాంతానికి ఏం చేశారో చెప్పాలని వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. జిల్లాకో నవోదయ స్కూల్ ఎందుకు తీసుకురాలేదని ప్రశ్నించారు. ప్రసాదం స్కీంలో రాజన్న ఆలయంతోపాటు కొండగట్టు, ధర్మపురి దేవస్థానాలను ఎందుకు కలపలేదని అడిగారు. హైదరాబాద్‌కు వచ్చిన ప్రధాని నరేంద్రమోదీ రాష్ట్రానికి ఏమి ఇవ్వకుండా కేవలం కుటుంబ పాలనపై మాట్లాడటం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు.

రూ.4,500 కోట్లతో అభివృద్ధి : రమేశ్‌బాబు

నియోజకవర్గంలో రూ.4,500 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే రమేశ్‌బాబు తెలిపారు. వచ్చే నెలలో సీఎం కేసీఆర్ వేములవాడకు వస్తున్నారన్నారు. రూ.672 కోట్లతో రైతులకు పెట్టుబడి సాయం అందించామన్నారు. మూలవాగును జీవనదిగా మార్చబోతున్నట్లు తెలిపారు. రూ.315 కోట్లతో ముంపు గ్రామాల సమస్యలు పరిష్కరించబోతున్నట్లు వివరించారు. రాజన్న గుడితోపాటు పట్టణాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. వంద మందికి దళితబంధు పథకం అందజేసినట్లు చెప్పారు. జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం ఇచ్చిన హామీ నెరవేర్చాలి

- 2008 డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేయాలి
- మంత్రి కేటీఆర్‌కు వేడుకోలు సభ
- డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ సంఘీభావం



వేడుకోలు సభలో డీఎస్సీ–2008 అభ్యర్థులు

సిరిసిల్లటౌన్: పద్నాలుగేళ్లుగా పోరాడుతున్న తమకు న్యాయం చేయాలని డీఎస్సీ–2008 సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌నాయక్ డిమాండ్ చేశారు. ఈమేరకు ఆదివారం సిరిసిల్ల ఆర్డీవో ఆఫీసు ఎదుట నిర్వహించిన మంత్రి కేటీఆర్‌కు వేడుకోలు సభలో మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో డీఎస్సీ–2008 ప్రకారం ఎంపికైన అభ్యర్థులకు అప్పటి పాలకుల తప్పుడు జీవోతో అన్యాయమైందన్నారు. 2016 జనవరి 3న తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ క్యాంప్ ఆఫీస్ సాక్షిగా చర్చలు జరిపి ఉద్యోగాలు ఇచ్చి ఆదుకుంటామని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. కోర్టు తీర్పు ప్రకారం అప్పటి నోటిఫికేషన్‌లో మిగిలిన పోస్టులలో ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. వీరికి డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ సంఘీభావం తెలిపారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శంకర్‌గౌడ్, డీటీఎఫ్ అధ్యక్షుడు దొంతుల శ్రీహరి, సుధాకర్‌రెడ్డి, పాతూరి మహేందర్‌రెడ్డి, దోర్నాల భూపాల్‌రెడ్డి, బి.నారాయణ, డీఎస్సీ–2008 సాధన సమితి ప్రధాన కార్యదర్శి మేర్గు భాస్కర్, వనజారెడ్డి, పద్మారెడ్డి, సాయి సౌమ్య, వేణు పాల్గొన్నారు.

మురుగుకు చెక్

- కమ్యూనిటీ ఇంకుడుగుంతలతో సమస్య పరిష్కారం
- లక్ష్యం 503.. పూర్తయినవి 354
- పెరుగుతున్న భూగర్భజలాలు
- తగ్గుతున్న దోమలు, ఈగలు

ముస్తాబాద్(సిరిసిల్ల): గ్రామాల్లో మురుగునీరు.. ఈగలు.. దోమల నివారణతోపాటు భూగర్భ జలాల పెంపునకు ఇంకుడుగుంతలు ఎంతగానో దోహదం చేస్తున్నాయి. ఐదేళ్ల క్రితం రాజన్నసిరిసిల్ల జిల్లాలో ఉద్యమంలా సాగిన ఇంటికో ఇంకుడు గుంత, మరుగుదొడ్డి నిర్మాణాలు ఇస్తున్న సత్ఫలితాలతో ఇప్పుడు సామాజిక ఇంకుడుగుంతల నిర్మాణాలు చేపట్టేలా జిల్లా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఉపాధిహామీలో చేపట్టిన ఇంకుడుగుంతల నిర్మాణాలు భవిష్యత్‌లో మరిన్ని ఫలితాలు ఇస్తాయనే భావన అధికారుల్లో కలుగుతుంది.

కాలుష్య నివారణ, భూగర్భజలాల పెంపు

జిల్లాలో 255 గ్రామాల్లో ఊరికి రెండు సామాజిక ఇంకుడుగుంతలు నిర్మించాలనేది అధికారుల లక్ష్యం. ఒక్కో ఇంకుడుగుంతకు రూ.12వేలు చెల్లిస్తున్నారు. సర్పంచులు ఆయా గ్రామాలలో 503 ఇంకుడుగుంతలు నిర్మించే దిశగా పనులు చేయిస్తున్నారు. ఇప్పటి వరకు 354 ఇంకుడుగుంతల పనులు పూర్తి చేశారు. రానున్న వానాకాలం నాటికి మిగతా వాటి పనులు పూర్తి చేయనున్నారు.

మురికిగా మారుతున్న వాగులు

పల్లెల్లో మురుగుకాల్వలు వాగులు, కాలువలు, చెరువులలో చేరి కలుషితం చేస్తున్నాయి. జిల్లాలని ఏ గ్రామంలో చూసిన మానేరు, మూలవాగు, చెరువులలోకి మురుగునీరు చేరుతోంది. అలాగే డ్రెయినేజీల నిర్మాణం కూడా సమస్యగా మారింది. మరోవైపు ఈగలు, దోమలు, దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇంకోవైపు మురుగునీటితోపాటు వానా నీరు కూడా వృథాగా పోతోంది. వీటన్నింటికి చెక్ పెట్టేందుకు సామాజిక ఇంకుడుగుంతల నిర్మాణానికి అధికారులు శ్రీకారం చుట్టారు. ముఖ్యంగా డ్రెయినేజీలపై, పాఠశాలలు, అంగన్‌వాడీలు, కమ్యూనిటీ భవనాలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఇంకుడుగుంతలు నిర్మించే పనిలో ఉన్నారు. ఐదేళ్ల క్రితం ఇంటికో మరుగుదొడ్డి నిర్మించుకున్న వారి నివాసాల వద్ద ఒకే గుంత తీసుకున్న వారికి కూడా మరో సెప్టిక్ ట్యాంక్ నిర్మించుకునేందుకు అధికారులు బిల్లులు ఇస్తున్నారు.

వాన నీటిని ఒడిసిపట్టి

సామాజిక ఇంకుడుగుంతల నిర్మాణంతో వృథాగా పోయే వాన నీటిని గుంతల్లోకి మళ్లించనున్నారు. పాఠశాలలు, కమ్యూనిటీ భవనాలు, ఫంక్షన్ హాల్స్, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో ఇంకుడుగుంతల నిర్మాణంతో వర్షపు నీరు భూగర్భంలోకి ఇంకేలా పనులు చేస్తున్నారు. అంతేకాదు ఆయా కార్యాలయాల వద్ద వచ్చే మురుగునీరు కూడా నేరుగా ఇంకుడుగుంతల్లోకి వెళ్తోంది.



నామాపూర్ స్కూల్‌లో ఇంకుడుగుంతను పరిశీలిస్తున్న ఎంపీడీవో

జిల్లాలో ఇంకుడుగుంతల నిర్మాణం ఇలా..

మండలం	లక్ష్యం	పూర్తయినవి
ముస్తాబాద్	44	38
బోయినపల్లి	46	42
చందుర్తి	38	26
ఇల్లంతకుంట	66	53
గంభీరావుపేట	42	18
కోనరావుపేట	56	36
రుద్రంగి	13	11
తంగళ్లపల్లి	60	31
వీర్నపల్లి	34	24
వేములవాడ	22	15
వేములవాడ(ఆర్)	34	24
ఎల్లారెడ్డిపేట	48	36

రెండు రోజుల్లో లక్ష్యం చేరుకుంటాం



మా మండలంలో 44 ఇంకుడుగుంతల నిర్మాణాలు లక్ష్యంగా పనులు మొదలుపెట్టాం. ఇప్పటి వరకు 38 ఇంకుడుగుంతల నిర్మాణాలు పూర్తయ్యాయి. మరో రెండు రోజుల్లో ఆరు నిర్మాణాలు పూర్తి చేస్తాం. మురుగునీటి సమస్య పరిష్కారానికి, వాననీటిని భూమిలోకి పంపించే చక్కటిమార్గం ఇంకుడుగుంత.

– రమాదేవి, ఎంపీడీవో, ముస్తాబాద్

కలుషితం కాకుండా చూస్తున్నాం



ముస్తాబాద్‌లో మురుగునీటి సమస్య ఉంది. నేరుగా మానేరు కాల్వలోకి మురుగునీరు వెళ్తోంది. కెనాల్‌లోకి మురుగునీరు వెళ్లకుండా ఇంకుడుగుంతలు నిర్మించాం. చెరువు వైపు కూడా ఇంకుడుగుంతలు నిర్మించి కాలుష్యం బారి నుంచి రక్షించే పనులు చేస్తున్నాం.

– గాండ్ల సుమతి, సర్పంచ్, ముస్తాబాద్

వృథా నీటిని అరికట్టవచ్చు



ముస్తాబాద్ మండలంలో 38 ఇంకుడుగుంతలు పూర్తి చేశారు. వీటి ద్వారా వృథాగా పోయే వానా నీటిని భూమిలోకి ఇంకేలా చేయవచ్చు. ప్రతీ ఇంటిలో ఇంకుడుగుంత నిర్మించుకునేలా ప్రోత్సహిస్తున్నాం. కాలుష్య రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా ముందుకెళ్తున్నాం.

– జనగామ శరత్‌రావు, ఎంపీపీ

క్లుప్తంగా

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

• నాగారంలో వైద్యశిబిరానికి స్పందన


వైద్యురాలిని సన్మానిస్తున్న గ్రామస్తులు

కోనరావుపేట: మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని ప్రముఖ వైద్యురాలు పి.లీలా శిరీష అన్నారు. మండలంలోని నాగారంలో ఏర్పాటుచేసిన ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభించి మహిళలకు వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేసి మాట్లాడుతూ.. మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నారని, ఆరోగ్య సమస్యల నుంచి బయటపడేందుకు పౌష్టికాహారం తీసుకోవాలని సూ చించారు. ఎలాంటి సమస్య వచ్చినా ఆస్పత్రి కివస్తే చికిత్స అందిస్తామన్నారు. మహిళల కోసం ప్రత్యేకంగా వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నా మన్నారు. డాక్టర్ శ్రీనాథ్ మహంకాళి, డాక్టర్ హేమలత వైద్యసేవలు అందించారు. సుమారు 300 మందికి పరీక్షలు చేసి మందులు అందించిన వైద్యులను గ్రామస్తులు, పాలకవర్గం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ బాస లావణ్య శ్రీనివాస్, వాటర్ కమిటీ చైర్మన్ దుంపెట నాగరాజు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రికి తరలిన ఎల్లారెడ్డిపేట గ్రామస్తులు


యాదాద్రి దర్శనానికి తరలివెళ్తున్న గ్రామస్తులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మేజర్ ప ంచాయతీ సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి ఆదివా రం 30 బస్సులలో 1,500 మంది గ్రామస్తుల ను తన సొంత ఖర్చుతో యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి తీసుకెళ్లారు. దైవదర్శనం చేసుకున్న గ్రామస్తులు ఆలయ నిర్మాణాన్ని చూసి సంబురపడ్డారు. సర్పంచ్ మాట్లాడుతూ గ్రామస్తులు సుఖసంతోషాలతో ఉండాలని యాదాద్రి లక్ష్మీనరసింహస్వామిని వేడుకున్నట్లు తెలిపారు. అందరికి అల్పాహారంతోపాటు యాదాద్రిలోనే భోజన వసతి కల్పించారు.

పోలీసుపై తిరగబడిన మందుబాబు

• డ్రంకెన్‌డ్రైవ్ కేసు నమోదు

సిరిసిల్లక్రైం: ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా ఆదివారం నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో పోలీసుల మీదకు మందుబాబు తిరగబడిన ఘటన సిరిసిల్ల పాతబస్టాండ్ ఏరియాలో చోటుచేసుకుంది. పాతబస్టాండ్ ఏరియాలో ట్రాఫిక్ ఎస్సై రాజు డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తుండగా పలువురుని తనిఖీ చేశారు. ఈక్రమంలో ఓ మందుబాబుకు బ్రీత్ అనలైజర్ చేయడానికి పోలీసులు ప్రయత్నించారు. దీంతో కోపోద్రిక్తుడైన అతడు ఏకంగా పోలీసు అధికారి కాలర్ పట్టుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇదే విషయాన్ని ట్రాఫిక్ ఎస్సై రాజును వివరణ కోరగా తాగిన మైకంలో అమర్యాద ప్రవర్తించిన వ్యక్తిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు చేస్తామని, మద్యంమత్తులో సదరు వ్యక్తి పేరును వెల్లడించలేదని ఎస్సై పేర్కొన్నారు.

పత్తి రైతుకు విత్తన భారం





పత్తి విత్తనాల ప్యాకెట్లు

• జిల్లా రైతాంగానికి రూ.అరకోటికి పైగా అదనపు భారం
• జిల్లాలో 58,650 వేల ఎకరాలకు పైగా పత్తి సాగు అంచనా
• పెరిగిన ఎరువులు, ఇంధన ధరల భారంతో అన్నదాత సతమతం
• పత్తి విత్తనాల ధరలు పెంచి, గిట్టుబాటు ధర ఊసెత్తని ప్రభుత్వాలు

చందుర్తి (వేములవాడ): పత్తి సాగుచేసే రైతులకు విత్తన ధర పెంచుతూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. సాగుకు ముందే ధర ఖరారు చేయడంతో రైతునెత్తిన మరో పిడుగు పడినట్లైంది. మార్కెట్‌లో 450 గ్రాముల పత్తి ప్యాకెట్ ధర రూ.810 ఉండగా ప్రస్తుతం రూ.853కు చేరింది. దీంతో జిల్లాలోని రైతాంగంపై అదనంగా రూ.అరకోటికి పైగా భారం పడుతోంది. ప్రతియేటా పంట సాగు సమయంలో అతివృష్టి , అనావృష్టి అన్నదాతను వెంటాడడంతో విత్తనాలు రెండుసార్లు వేసే పరిస్థితి నెలకొనడంతో విత్తనాల ఖర్చు తడిసి మోపెడవుతోంది. జిల్లాలోని 2.18 లక్షల ఎకరాల్లో పంటలు సాగుచేస్తున్నారు. ఇందులో వరి 1.45 లక్షల ఎకరాల్లో సాగుచేస్తుండగా , రెండో పంటకు పత్తిని 58,650 వేల ఎకరాల్లో వేస్తున్నారు. మిగితా 17వేల ఎకరాల్లో ఇతర పంటలు మొక్కజొన్న, కందులు, ఇతర పంటలు సాగుచేస్తున్నారు. పత్తివిత్తనాల ధర పెరగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

• గిట్టుబాటు ధర అంతమాత్రంగానే .....

పత్తి రైతులను మూడేళ్లుగా అధిక వర్షాలు వెంటాడుతున్నాయి. దీంతో పంటకు తెగుళ్లు సోకడంతో వాటి నివారణకు విచ్చలవిడిగా క్రిమిసంహారక మందుల వాడేందుకు వెచ్చించే వ్యయం రెండింతలు పెరిగింది. అధిక వర్షాలతో పంటల దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఎకరాకు 8 క్వింటాళ్ల నుంచి 15 క్వింటాళ్ల వరకు వచ్చే దిగుబడి తగ్గింది. ఎకరాకు 6 క్వింటాళ్ల నుంచి 7 క్వింటాళ్ల వరకే దిగుబడి రావడంతో రైతులకు పెట్టుబడి చేతికందడం లేదని రైతులు వాపోతున్నారు. కేంద్ర ప్రభుత్వం గిట్టుబాటు ధరను వందల్లో మాత్రమే పెంచుతోంది. ప్రస్తుతం సీసీఐ కొనుగోలు ధర గరిష్టంగా రూ.6,380గా ఉంది, బహిరంగ మార్కెట్‌లో మాత్రం రూ. 7వేల నుంచి రూ.8వేల వరకు పలుకుతోంది. పత్తికి కేంద్ర ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించడం లేదన్న ఆరోపణలు రైతులు చేస్తున్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా గిట్టుబాటు ధర కల్పిస్తే పంటల సాగులో ఆర్థికంగా దివాళా తీయకుండా ఉంటారన్న ధీమాను రైతులు వ్యక్తం చేస్తున్నారు.

• పెరిగిన ఎరువుల ధరలు.... ఇంధన ఖర్చులు

రైతులకు విత్తన ధరతో పాటు గతేడాది ఎరువుల ధరపై కేంద్ర ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీని తగ్గించడంతో కాంప్లెక్స్ ఎరువుల ధరలు ఏకంగా రూ.360 నుంచి రూ.700ల వరకు పెరిగాయి. దీంతో జిల్లావ్యాప్తంగా ఎరువుల భారం రూ.1.85 కోట్లు దాటింది. రైతులు పండించే పంటలకు ధరలు పెంచుతూ వారికి ఆశించిన మేర గిట్టు బాటు ధర కల్పించకపోవడంతో రైతులు పంటల సాగును భారంగా భావిస్తున్నారు. ఈ యేడాది పత్తి ధరను క్వింటాల్‌కు రూ. 310 పెంచి చేతులు దులుపుకున్నారు. అయినప్పటికీ ఎరువుల ధరతో పాటు ఇంధన ధరలు పెరగడంతో వ్యవసాయంలో యంత్రాల వినియోగానికి ఇంధన ఖర్చు తడిసిమోపడవుతోంది. దీంతో రైతులు పంటలు సాగుచేయాలంటే విత్తనాలు, కూలీలు, ఎరువులు, ఇంధన ధరలన్నీ రైతుల పాలిట శాపంగా మారాయి.

• లూజ్ పత్తి విత్తనాల వైపు రైతుల చూపు

కేంద్ర ప్రభుత్వం పత్తివిత్తనాల ధర పెంచడంతో రైతులు లూజ్ పత్తి విత్తనాలు కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. కొందరు రైతుల బలహీనతను ఆసరాగా చేసుకున్న వ్యాపారులు లూజ్ పత్తి విత్తనాలను ఆంధ్రనుంచి తెచ్చి ఇక్కడ విక్రయిస్తున్నారన్న ప్రచారం సాగుతోంది. అంతేకాకుండా గతంలో నకిలీ విత్తనాలు అమ్ముతు పట్టుబడిన ఎంతోమంది వ్యాపారులపై జిల్లావ్యాప్తంగా కేసులు నమోదుచేసిన ఘటనలు ఉన్నాయి. ఈ సారి కూడా పత్తివిత్తనాల వ్యాపారం జోరుగా సాగుతోందని ప్రచారం. లూజ్ పత్తి విత్తనాలు కిలోకు రూ.550 నుంచి రూ.700 ధరకు విక్రయిస్తుండడంతో వీటిపైనే రైతులు దృష్టి సారిస్తున్నారు. ఎకరా పత్తి విత్తనాలకు ప్యాకెట్ కొనుగోలు చేస్తే రూ.2,559 ఖర్చు అవుతోందని విత్తన భారం సగానికి సగం తగ్గుతుందనే రైతులు భావిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే వ్యవసాయాధికారుల కళ్లుగప్పి బీటీ 3 పత్తి విత్తనాలను సాగు చేస్తున్నారని తెలిసింది.

ఎరువులు, పత్తి విత్తనాలపై సబ్సిడీ పెంచాలి



రైతులకు సాగు ఖర్చులు ఏటా పెరుగుతున్నాయి. దీనికి తోడు కేంద్రం సబ్సిడీలను తగ్గించడంతో ఎరువుల ధరలు పెరిగాయి. దీంతో మూలిగే నక్కపై తాటిపండు పడినట్లైంది. సబ్సిడీ పెంచడం చేతకాకపోతే కనీసం పండించిన పంటలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిట్టుబాటు ధరలు పెంచి ఆదుకోవాలి. లేకుంటే రైతులు ఆర్థికంగా నష్టపోతారు.

– తాడిశెట్టి తిరుపతిరెడ్డి, రైతుసంఘం అధ్యక్షుడు, బందపల్లి

డిగ్రీ కళాశాల హామీ నెరవేర్చాలి


మాట్లాడుతున్న రంజిత్‌కుమార్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుపై మంత్రి కేటీఆర్ ఇచ్చిన హామీని నెరవేర్చాలని ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేణి రంజిత్‌కుమార్ కోరారు. ఎల్లారెడ్డిపేటలో ఆదివారం మాట్లాడుతూ.. స్థానికంగా డిగ్రీ కళాశాల లేక నిరుపేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారన్నారు. ఏటా 1,500 మంది ఇంటర్ ఉత్తీర్ణులు అవుతున్నప్పటికీ సగంకూడా ఉన్నత విద్యకు నోచుకోలేకపోతున్నారన్నారు. కళాశాల కోసం అనేకసార్లు విద్యార్థులతో కలిసి పోరాటాలు చేస్తే మంత్రి కళాశాల ఏర్పాటుకు హామీ ఇచ్చారన్నారు. సోమవారం మండల పర్యటనకు వస్తున్న మంత్రి డిగ్రీ కాలేజీపై స్పష్టత ఇవ్వాలని కోరారు. లేకుంటే అడ్డుకుంటామని హెచ్చరించారు.

మొదలైన బీరప్ప కామరాతి ఉత్సవాలు


విన్యాసం చేస్తున్న ఒగ్గుడోలు కళాకారులు

కోనరావుపేట: మండలంలోని మర్తనపేటలో బీరప్ప కామరాతి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామంలోని యాదవ సంఘం ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆదివారం లింగాల ప్రతిష్ట కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాకారుల విన్యాసాల మధ్య ఊరేగింపుగా వెళ్లి కార్యక్రమాలు నిర్వహించారు. సర్పంచ్ వంశీకృష్ణ రావు, ఆధ్యా ఫౌండేషన్ చైర్మన్ గోలిమోహన్, యాదవ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఊరూ వాడా అంతా బలగమే


బలగం సినిమా చూస్తున్న జనం


నారాయణపూర్‌లో సినిమా చూస్తున్న గ్రామస్తులు

వేములవాడ/ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): అత్యధికంగా జనాదరణ పొందుతున్న బలగం సినిమా చూసేందుకు ఊరూ... వాడా అంతా ఏకమవుతున్నారు. ఊర్లు, పట్టణాల్లో డప్పుచాటింపులు వేయిస్తూ అంతా ఒకేచోట చేరి ఓపెన్ థియేటర్లలో చల్లని వాతావరణంలో బలగం సినిమాచూస్తూ ఆస్వాదిస్తున్నారు. వేములవాడ పట్టణం, అర్బన్ మండలం, రూరల్ మండలం, చందుర్తి, రుద్రంగి, కోనరావుపేట, బోయిన్‌పల్లి మండలాల్లోని ఆయాగ్రామాల్లో పెద్దఎత్తున జనం ఒకేచోట చేరి గతంలో ప్రొజెక్టర్లతో సినిమాలు చూసిన విధంగా గతాన్ని గుర్తు చేసుకుంటూ ఆనందం వ్యక్తంచేశారు. ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్, బండలింగంపల్లి గ్రామాల్లో ఆదివారం రాత్రి బలగం సినిమా ప్రదర్శించారు. ఆద్యంతం సినిమా చూస్తూ కన్నీటి పర్యంతమయ్యారు. సినిమా చూస్తున్నంతాసేపు బంధాలు, బంధుత్వాలపై, ఆనాటి పరిస్థితితులను తలుచుకుంటూ.. దుఃఖంలో మునిగారు.

నీలోజిపల్లిలో పట్టపగలు చోరీ

• బంగారు నగలు, వెండి అపహరణ


చోరీ ప్రదేశంలో ఫింగర్‌ప్రింట్స్ సేకరిస్తున్న బృందం


సీసీ కెమెరాలో రికార్డయిన కారు

బోయినపల్లి(చొప్పదండి): రాజన్నసిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం నీలోజిపల్లి పునరావాస కాలనీకి చెందిన అనుముల మహేందర్ ఇంట్లో ఆదివారం పట్టపగలు చోరీకి పాల్పడ్డారు. నాలుగు తులాల బంగారు నగలు, పట్టగొలుసులు అపహరణకు గురయ్యాయి. పోలీసులు, బాధితుడి కథనం ప్రకారం వివరాలు. మహేందర్ కుటుంబ సభ్యులు ఆదివారం ఇంటికి తాళం వేసి వ్యవసాయ పనులకు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేరని గుర్తించిన దొంగలు తాళం పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. బీరువాను తెరిచి 4 తులాల బంగారు నగలు, పట్టగొలుసులను ఎత్తుకెళ్లారు. బీరువాలో ఉన్న బట్టలు చిందర వందర చేశారు. మహేందర్ ఇంటికొచ్చి చూసేసరికి బీరువా తెరిచి ఉంది. బంగారు నగలు, పట్టగొలుసులు కనిపించలేవు. ఎస్సై మహేందర్, ఏఎస్సై చంద్రమౌళి సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. క్లూస్ టీమ్, ఫింగర్‌ప్రింట్స్ సేకరించే బృందం పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. చోరీ జరిగిన అనంతరం ఇంటి ముందు నుంచి ఓ కారు వెళ్లడం సీసీ కెమెరాలో రికార్డయినట్లు భావిస్తున్నారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి


తోకల నవీన్(ఫైల్)

కోరుట్లరూరల్: మండలంలోని పైడిమడుగు గ్రామంలో విద్యుత్‌షాక్‌కు గురై తోకల నవీన్(33) యువకుడు మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. నవీన్ గతంలో ఉపాధి నిమిత్తం గల్ఫ్‌వెళ్లి వచ్చాడు. గ్రామంలోనే ఎలక్ట్రీకల్ పనిచేస్తూ స్థిరపడ్డాడు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం అదేగ్రామంలోని ఓ ఇంట్లో కూలర్ రిపేర్ చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు కోరుట్ల ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతిచెందాడు. నవీన్‌కు భార్య, రెండేళ్ల కూతురు, తల్లి, తండ్రి ఉన్నారు. నవీన్ మృతితో గ్రామంలో విషాదం నెలకింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

ఇల్లంతకుంట: మండలంలోని రహీంఖాన్‌పేట శివారులో ఆదివారం సాయంత్రం రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. తంగళ్లపల్లి పద్మనగర్‌కు చెందిన దొంతుల అరుణ్, బండి సాకేత్, అదే మండలంలోని చీర్లవంచకు చెందిన గండి అక్షయ్ ముగ్గురు బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా బైక్‌పై వస్తున్న సురేశ్ అనే యువకుడు ఢీకొట్టడంతో సురేశ, అరుణ్, అక్షయ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సాకేత్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. తీవ్ర గాయాలైన ముగ్గురిని పోలీసులు, స్థానికులు ప్రైవేట్ అంబులెన్స్‌లో కరీంనగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. తంగళ్లపల్లి, చీర్లవంచ గ్రామానికి చెందిన ముగ్గురు 9,10 తరగతి చదువుతున్నట్లు తెలుస్తోంది. ఎస్సై రాజేశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి..

• ఒకరి పరిస్థితి విషమం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం శివారులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ఇందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రథమ చికిత్స అనంతరం కరీంనగర్ తరలించారు. ముస్తాబాద్ మండలం రాంరెడ్డిపల్లికి చెందిన శివరాత్రి బలరామ్, నవీన్ బైక్‌పై రాచర్లగొల్లపల్లికి వెళ్లి తిరిగి వస్తుండగా.. ఎల్లారెడ్డిపేట నుంచి గొల్లపల్లికి మరో బైక్‌పై స్థానిక యువకులు మహేందర్, రాములు వెళ్తున్న బైక్ ఢీకొట్టుకున్నాయి. ఈ ప్రమాదంలో నవీన్, రాములు గాయపడ్డారు. ఇందులో నవీన్ పరిస్థితి విషమంగా మారింది.స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం కరీంనగర్ తరలించారు.

బైక్ కొనివ్వలేదని యువకుడి ఆత్మహత్య


ప్రభాకర్ (ఫైల్)

జగిత్యాలక్రైం: బైక్ కొనివ్వలేదని ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం వెలుగుచూసింది. జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్‌కు చెందిన రాజుల ప్రభాకర్(28) యువకుడు కూలీపనులు చేస్తూ జీవిస్తున్నాడు. కొంతకాలంగా బైక్ కావాలని కుటుంబ సభ్యులను కోరగా వారు కొనిచ్చేందుకు నిరాకరించారు. దీంతో మనస్థాపం చెందిన ప్రభాకర్ ఈనెల 7న గ్రామశివారులోని మామిడి తోటలో పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు జగిత్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించగా చికిత్సపొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడి తల్లి లక్ష్మీఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై అనిల్ తెలిపారు.

బీసీ, ఎస్సీ, ఎస్టీల రాజ్యస్థాపనకు పోరాటం

• నాలుగు గ్రామాల్లో డీఎస్పీ పాదయాత్ర


బోయినపల్లిలో దళిత్ శక్తి ప్రోగ్రాం పాదయాత్ర

బోయినపల్లి(చొప్పదండి): రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీల రాజ్యస్థాపనకు ప్రతీ ఒక్కరు ముందుకు రావాలని దళిత్ శక్తి ప్రోగ్రాం(డీఎస్పీ) జిల్లా ఉపాధ్యక్షుడు ఎడపెల్లి బాబు పేర్కొన్నారు. దళిత్‌శక్తి ప్రోగ్రాం వ్యవస్థాపకుడు డాక్టర్ విశారదన్ మహారాజ్ చేపట్టిన 10వేల కిలోమీటర్ల స్వరాజ్య పాదయాత్రకు సంఘీభావంగా ఆదివారం మండలంలోని కోరెం, అనంతపల్లి, బూర్గుపల్లి, బోయినపల్లి గ్రామాల మీదుగా 10 కిలోమీటర్ల పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ.. గతేడాది మార్చి 15న ప్రారంభమైన పాదయాత్ర అన్ని జిల్లాలు తిరుగుతూ ఇప్పటికీ 9,500 కిలోమీటర్లు విజయవంతంగా పూర్తిచేశారని.. త్వరలో హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో ఉల్లెందుల అరుణ్, కట్కూరి బాలరాజు, డీఎస్పీ ప్రోగ్రాం మండల అధ్యక్షుడు కొమ్ము విక్రమ్, ప్రతినిధులు కుర్మ సురేశ్, కుడుకల మధు, గిరిబాబు, కుర్మ సంజీవ్, వంశీ, బూర్గు విజయ్, ప్రసాద్, రామంచ పర్శరామ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ అసమర్థత వల్లే టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్


ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న రాజమ్మ

వెల్గటూర్: రాష్ట్రప్రభుత్వం అసమర్థత వల్లే టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకైందని వైఎస్సార్‌టీపీ ధర్మపురి నియోజకవర్గ ఇన్‌చార్జి మోకెనపెల్లి రాజమ్మ అన్నారు. వైఎస్సార్‌టీపీ అధినేత్రి షర్మిల ఆదేశాలతో సేవ్‌తెలంగాణ కార్యక్రమంలో భాగంగా ఆదివారం వెల్గటూర్ మండలం కిషన్‌రావుపేట చౌరస్తా వద్ద ప్రభుత్వవైఫల్యాలు, విద్యార్థులు, నిరుద్యోగులకు రాష్ట్రంలో జరుగుతున్న అన్యాయంపై నిరసనగా ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా రాజమ్మ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం వల్లే టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకైందని దీంతో 30 లక్షల మంది విద్యార్థులు, నిరుద్యోగులు రోడ్డున పడ్డారన్నారు. పేపర్ లీక్ అంశాన్ని సీబీఐ లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, టీఎస్‌పీఎస్సీ బోర్డు ప్రక్షాళన చేయాలని, నిరుద్యోగులకు రూ.3,016 నిరుద్యోగభృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో రానున్నది రాజన్న రాజ్యమేనని, తెలంగాణ ప్రజలు షర్మిలమ్మను ఆశీర్వదిస్తారని రాజమ్మ అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీపీ నాయకులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి మండలమేనా..!?


తంగళ్లపల్లిలో వెలసిన పోస్టర్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): అమాత్య ఎందుకు మాపై వివక్ష.. మాది తంగళ్లపల్లి మండలమా? లేక గ్రామమా? అంటూ మండలకేంద్రంలో పోస్టర్లు వెలిశాయి. సోమవారం మంత్రి కేటీఆర్ పర్యటన తంగళ్లపల్లి మండలంలో ఉండడం ఆదివారం ఈ పోస్టర్లు వెలవడం ఆసక్తి రేకెత్తిస్తోంది. తంగళ్లపల్లి పట్టణ(గ్రామ) పోరాట వేదిక అఖిల పక్షంపేరిట పోస్టర్లు వెలువడగా అందులో పేర్లు లేకుండా ఆరుగురి ఫోన్‌నంబర్లను సైతం ముద్రించారు. తంగళ్లపల్లి మండలం ఏర్పడి ఆరేళ్లు గడుస్తున్నా.. మండలం అభివృద్ధి చేయడం లేదని తహసీల్దార్ కార్యాలయం, బస్టాండ్, రైతులు కళ్లాలకు వెళ్లేందుకు రోడ్లు, నడిరోడ్డులో ఉన్న రాములోరి గుడి తరలింపు, విద్యార్థుల కోసం జూనియర్ కళాశాల ఏర్పాటు, యువకులకు క్రీడామైదనాం, మల మూత్ర విసర్జనకు పబ్లిక్ టాయిలెట్స్ ఏర్పాటుచేయలేదని పోస్టర్‌లో ప్రశ్నించారు. తంగళ్లపల్లిని సిరిసిల్ల మున్సిపాలిటీలో కలిపేందుకు కుట్రచేస్తున్నారని అందులో పేర్కొన్నారు. ఈ పోస్టర్లు ఎవరు వేశారు. ఎందుకు వేశారు అనే చర్చ సాగుతోంది.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


అవగాహన కల్పిస్తున్న సీఐ బన్సీలాల్

వేములవాడరూరల్: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని వేములవాడరూరల్ సీఐ బన్సీలాల్ అన్నారు. మర్రిపల్లిలో పోలీస్ మీకోసం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలు, దొంగతనాలు, మైనర్ డ్రైవింగ్, ట్రాఫిక్ అవేర్‌నెస్, సీసీటీవీ కెమెరాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నాగరాజు, సర్పంచ్ మల్లేశం, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు తోడ్పాటునందిస్తా

• ఆద్య ఫౌండేషన్ చైర్మన్ గోలి మోహన్


మోహన్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

కోనరావుపేట(వేములవాడ): గ్రామీణ ప్రాంతాల్లో ని నిరుద్యోగ యువతకు ఉపాధి అందించేందుకు తోడ్పాటునందిస్తానని ఆద్య గోలి ఫౌండేషన్ చైర్మన్ గోలి మోహన్ పేర్కొన్నారు. కోనరావుపేట మండలం ఎగ్లాస్‌పూర్‌లో ఎల్లమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో యువత చాలా మంది ఉన్నారని, వారికి సరైన ఆదాయమార్గాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉపాధిమార్గం చూపెట్టాలని కోరారు. తనవంతు సహకారాన్ని అందిస్తానని హామీ ఇచ్చారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో గోలి మోహన్‌ను సన్మానించారు.